బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ కౌన్సిలర్ దాడి

దుండిగల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని శంభీపూర్ గ్రామంలో హనుమాన్ ఆలయం వద్ద బీజేపీ నాయకులపై బీఆర్ఎస్ కౌన్సిలర్ అనుచరులతో కలిసి దాడి చేశారు. పోలీసులు వచ్చి ఇరుపార్టీల నాయకులపై లాఠీలు ఝుళిపించి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బీజేపీ నాయకుడు కేసారం శ్రీనివాస్ ఈ ఘటనపై బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈటల రాజేందర్ ఎంపీగా విజయం సాధించడంతో మంగళవారం రాత్రి శంభీపూర్ గ్రామంలోని హన్‌మాన్ ఆలయం వద్ద బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకుంటున్నారు. కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ, ఆయన అనుచరులు రమేష్, భిక్షపతి, జీతయ్య, శ్రీశైలం, ఎం.శ్రీశైలం, చంద్రశేఖర్, ఎస్.రమేష్, మల్లేష్, కె.వినయ్, కె.అభి, కె.బబ్లూ, ఎ.వికాస్, ఎస్ దీపక్, ప్రభాకర్, మరికొంత మంది.. బీజేపీ నాయకులను బెదిరించారు. విద్యుత్ సరఫరా నిలిపివేసి బీజేపీ నాయకుడు శ్రీనివాస్‌పై దాడి చేసి రెండు సెల్‌ఫోన్‌లు పగులగొట్టారు. కారు (నం.టీఎస్ 08 టీఆర్‌కెఎం1502) అద్దాన్ని పగుల కొట్టి, స్టీరింగ్ విరగొట్టి కర్రలతో దాడి చేశారు.

కార్మికులకు సీపీఐ అండ


నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ కార్మికులు

గాజులరామారం, జూన్ 5(ఆంధ్రజ్యోతి): కార్మికులకు సీపీఐ అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ కార్యదర్శి ఉమామహేష్ తెలిపారు. మున్నూరు యాజమాన్యం మొండి వైఖరి కారణంగా ఉమామహేష్ ఆధ్వర్యంలో సెంట్రింగ్ కార్మికులతో కలిసి బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గాజులరామారం డివిజన్ పరికి చెరువును ఆనుకొని ఎఫ్‌టీఎల్‌లో అక్రమంగా నిర్మాణం చేపడుతూ సెంట్రింగ్ కాంట్రాక్టర్‌కు డబ్బులు ఇవ్వకుండా బెదిరిస్తున్నారని సీపీఐ నాయకులు అన్నారు. సీపీఐ మండల కోశాధికారి సదానంద్ సెంట్రింగ్ కార్మికులు పాల్గొన్నారు.

జానీ మాస్టర్‌పై రాయదుర్గం పీఎస్‌లో ఫిర్యాదు

రాయదుర్గం, జూన్5(ఆంధ్రజ్యోతి): తమకు షూటింగ్స్‌లో డ్యాన్స్ అవకాశాలు రాకుండా జానీ మాస్టర్ చేస్తున్నాడని డ్యాన్సర్ సతీష్ రాయదుర్గం పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు. షూటింగ్‌లకు సతీష్‌ను పిలవొద్దని యూనియన్ సభ్యులతో జానీ మాస్టర్ ఫోన్లు చేయిస్తుండటంతో నాలుగు నెలలుగా తమకు పని లేకుండా పోయిందని ఫిర్యాదులో పేర్కొన్నాడు. డ్యాన్సర్స్ అసోసియేషన్ జనరల్ మీటింగ్‌లో సమస్యలపై మాట్లాడినందుకు జానీ మాస్టర్ తనపై కక్ష పెంచుకొని వేధిస్తున్నాడని పేర్కొన్నారు. తెలుగు ఫిలిం అండ్ టీవీ డ్యాన్సర్స్, డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్‌కు జానీ మాస్టర్ అధ్యక్షుడిగా ఉన్నాడని, పదవిని అడ్డుపెట్టుకొని షూటింగ్‌లకు తనను పిలిచే మాస్టర్లను, కోఆర్డినేటర్లను బెదిరిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదును తీసుకున్న పోలీసులు ఈ సమస్య క్రైమ్ పరిధిలోకి వస్తే కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతామని పోలీసులు తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న బండి రమేష్

ప్రజలకు మరింత చేరువవుతాం

బాలానగర్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): బాలానగర్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి ఫలితాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 6 నెలల వ్యవధిలో జరిగిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గణనీయ ఫలితాలు సాధించిందని, సంతోషంగా ఉందన్నారు. ఓట్లు పెరగడం పూర్తిగా కార్యకర్తల కృషిగా ఆయన అభివర్ణించారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో నియోజకవర్గంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా ప్రణాళికను రూపొందించుకుంటే ప్రజలకు మరింత చేరువవుతామని తన ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో కొండకింది పుష్పారెడ్డి, ఏ బ్లాక్ ప్రెసిడెంట్ పటోళ్ల నాగిరెడ్డి, శేరిసతీష్‌రెడ్డి, పాల్గొన్నారు.

పాలపిట్ట పార్కులో 10కే సైకిల్‌రైడ్

గచ్చిబౌలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని పాలపిట్ట పార్కులో హైదరాబాద్ బైస్కిల్ ఆధ్వర్యంలో 10 కిలోమీటర్ల సైకిల్‌రైడ్ బుధవారం నిర్వహించారు. గురుస్థాన్ పిరమిడ్ ధ్యానస్థలి నిర్వాహకుడు నాగేంద్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సైకిల్‌యాత్రలో సుమారు 500 మంది పాల్గొన్నారు. పాలపిట్ట పార్కులో సుమారు పది కిలోమీటర్లు నిర్వహించిన సైకిల్‌రైడ్‌లో పిల్లల నుంచి వృద్ధుల వరకు వయస్సుతో సంబంధం లేకుండా పాల్గొన్నారు.

● మదర్‌సేవా సమితి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి వార్డు కార్యాలయంలో పర్యావరణ పరిరక్షణ కోరుతూ ట్రస్టు చైర్మన్ బద్దం కొండల్‌రెడ్డి ప్రపంచ పర్యావరణ దినాన్ని ఘనంగా నిర్వహించారు. వ్యర్థాలు, ప్లాస్టిక్ తయారీ, వినియోగం వల్ల పర్యావరణానికి తీవ్ర ఆటంకం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు లింగారెడ్డి, రమేష్‌రెడ్డి, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

నలుగురి అదృశ్యం


పావని   మాణిక్యం   ఆంజనేయులు

జీడిమెట్ల, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు అదృశ్యమయ్యారు. భూదేవిహిల్స్‌కు చెందిన వీరేష్‌గౌడ్ భార్య పావని(33) అప్పులు ఎక్కువ కావడంతో నిరాశ చెందారు. ఈనెల 4వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయింది. అదేవిధంగా జగద్గిరిగుట్ట రెడ్‌బిల్డింగ్ ప్రాంతంలో నివాసముంటున్న మాణిక్యం(55) భార్య చనిపోవడంతో మనస్తాపంతో ఈనెల 5వ తేదీన ఇంటినుంచి వెళ్లిపోయాడు. తల్లి మందలించడంతో ధరణినగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ ఆంజనేయులు(22) ఈనెల 4వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబసభ్యుల ఫిర్యాదుతో జగద్గిరిగుట్ట పోలీసులు కేసులు దర్యాప్తు చేస్తున్నారు.

● **కొండాపూర్‌లో..**


అభివర్ధన్

రాయదుర్గం: కొండాపూర్‌లో నివాసం ఉండే అభివర్దన్(28) ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులు, ఇతర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో గచ్చిబౌలి పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



అధికారుల నుంచి అవార్డు అందుకొంటున్న ఆసుపత్రి నిర్వాహకులు

రామ్‌దేవ్‌రావు ఆసుపత్రికి పర్యావరణ అవార్డు

కూకట్‌పల్లి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లిలోని రామ్‌దేవ్‌రావు ఆసుపత్రికి రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తరఫున అవార్డును అందజేశారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీసీబీ ఆధ్వర్యంలో బుధవారం పలు సంస్థలకు నగరంలోని పర్యావరణ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా రామ్‌దేవ్‌రావు ఆసుపత్రి తరఫున విక్రమ్‌దేవ్‌రావు, డా.యోబు అవార్డును అందుకొన్నారు. గ్రీన్ ఛాంపియన్ అవార్డు ఇన్ బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ కేటగిరిలో భాగంగా అవార్డు దక్కడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. గత కొన్నేళ్లుగా ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంపొందించడంతో పాటు వ్యర్థాలను వైద్యశాఖ నిబంధనల ప్రకారం సెగ్రిగేషన్ చేయడం, పరిసరాలను శుభ్రంగా ఉంచడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని అవార్డును అందజేసినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి నిర్వాహకులు విక్రమ్‌దేవ్‌రావు, మీరారావు, ప్రశాంత్‌రెడ్డి, అపర్ణరావులు ఆసుపత్రిలోని ఆయాలు, వార్డు బాయ్స్‌కు అవార్డును అంకితం చేస్తున్నామని చెప్పారు.

గుంతల రోడ్లతో అవస్థలు

రోడ్డుపై చేరిన ఇసుకతో ప్రమాదాలు


గుంతలుపడిన దూలపల్లి రోడ్డు


గాజులరామారం రోడ్డుపై పేరుకుపోయిన ఇసుక

పేట్‌బషీరాబాద్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): జీడిమెట్ల పారిశ్రామిక వాడ నుంచి దూలపల్లికి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయంగా మారింది. రెండు రోజుల క్రితం కురిసిన వర్షానికి రహదారిపై ఉన్న చిన్న గుంతల్లో నీరు నిలువడంతో వాహనాలు రాకపోకలతో అవి పెద్దగా మారాయి. గుంతల్లో తూతూ మంత్రంగా మట్టిపోసి చేతులు దులుపుకుంటున్నారే తప్పా.. శాశ్వత పరిష్కారం చూపడం లేదు. గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

● **మురుగునీటి ప్రవాహం**

రంగారెడ్డినగర్ ప్రధాన రహదారిపై మురుగునీరు పొంగి ప్రవహిస్తోంది. ఈ రోడ్డుపై పాదాచారులు నడిచే పరిస్థితి కూడా లేదు. రహదారి మొత్తం మురుగునీరు చేరడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాహనాల రాకపోకల సమయంలో మురుగునీరు ఇతర వాహదారులు, పాదాచారులపై పడుతోంది. దీనికి తోడు తీవ్రమైన దుర్వాసన వెదజల్లుతోంది.

● **రోడ్డుపై ఇసుక మేటలు**

గాజులరామారం: ఆదివారం కురిసిన వర్షానికి గాజులరామారం ప్రధాన రోడ్డుపై ఇసుక మేటలు వేసింది. ఇసుక కారణంగా వాహనదారులు రోడ్డుపై జారి పడుతున్నారు. వర్షం వచ్చిందంటే ఈ రోడ్డు గుండా వాహనాలు వెళ్లేందుకు వీలు లేకుండా వర్షపు నీరు నిలుస్తోంది. రోడ్డుపై ఇసుక పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు, వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు.

రేపు పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరాలో అంతరాయం

హైదరాబాద్‌సిటీ, జూన్5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాలకు శుక్రవారం ఉదయం ఆరు నుంచి మరుసటి రోజు ఆరు గంటల వరకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని వాటర్‌బోర్డు అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని లింగంపల్లి, పటాన్‌చెరు, ఈఎస్‌ఐ కమాన్ తదితర ప్రాంతాల్లో ఉన్న 900 ఎంఎం డయా పీఎస్సీ పైపులైన్‌కు జంక్షన్ పనులు చేపడుతున్నారు. ఈ పనులు శుక్రవారం ఉదయం ఆరు నుంచి శనివారం ఉదయం ఆరు గంటల వరకు 24 గంటల పాటు జరగనున్నాయి. దీంతో అపరేషన్ మెయింటనెన్స్ 8, 9డివిజన్లలో నీటి సరఫరాలో అంతరాయం కలుగనుందని, పటాన్‌చెరు, ఆర్సీపురం, అశోక్‌నగర్, జ్యోతినగర్, లింగంపల్లి, చందానగర్, గంగారం, మదీనాగూడ, హఫీజ్ పేట్, డోయెన్స్‌కాలనీ, ఎస్‌బీఐ ట్రైనింగ్ సెంటర్, బీహెచ్ఈఎల్ ఫ్యాక్టరీ, టౌన్‌షిప్, హెచ్‌సీయూ, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతవాసులకు అంతరాయం తలెత్తుందని అధికారులు తెలిపారు.


కేపీహెచ్‌బీలోని ఓ మాల్‌లో బుధవారం రాత్రి సినీతారలు రియా, వర్షిని సందడి చేశారు. అభిమానులకు హాయ్ చెబుతూ చిరు నవ్వులు చిందించారు.
-కేపీహెచ్‌కాలనీ, ఆంధ్రజ్యోతి

స్టాక్‌మార్కెట్ ఐపీవో పేరుతో మోసం

● లోన్ ఇప్పించి.. రూ.34.90 లక్షలు కొట్టేశారు
● వాట్సా్ప్‌లో మెసేజ్.. '657 ఐసెకన్' పేరుతో గ్రూప్
● ప్రత్యేక యాప్‌తో బురిడీ.. నిలువునా ముంచిన కేటుగాళ్లు

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): స్టాక్ మార్కెట్‌లో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్(ఐపీవో)లో పెట్టుబడి పేరుతో.. సైబర్ కేటుగాళ్లు రుణం ఇప్పించి మరీ ఓ బాధితుడి నుంచి రూ.34.90 లక్షలు కొట్టేశారు. నగరానికి చెందిన సదరు బాధితుడి ఫిర్యాదుతో సీసీఎస్ సైబర్‌క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. నగరానికి చెందిన బాధితుడు వాట్సా్ప్‌లో స్టాక్‌మార్కెట్ పేరుతో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేశాడు. '657 ఐసెకన్' అనే వాట్సాప్ గ్రూపులో అతడు యాడ్ అయ్యాడు. ఆ గ్రూప్‌లో 140 మంది సభ్యులున్నారు. వారంతా రోజువారీ వ్యూహాలు.. లాభాల గురించి చర్చించుకుంటున్నారు. గ్రూప్ అడ్మిన్ నుంచి 'ఇంకా యాప్ డౌన్‌లోడ్ చేసుకోనివాళ్ల కింది లింక్ ద్వారా వివరాలను పంపొచ్చు' అనే సందేశాన్ని పోస్ట్ చేశాడు. దానికి బాధితుడు స్పందించడంతో.. వ్యక్తిగత వివరాలను సేకరించి, అతడితో ఫేక్ బ్రోకరేజ్ యాప్ ను డౌన్‌లోడ్ చేయించారు. అందులో ట్రేడింగ్ చేసే సదుపాయం కల్పించారు. శివం కెమెకిల్స్ అనే కంపెనీ ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్స్ (ఐపీవో) లో పెట్టుబడులు పెట్టాలంటూ యాప్ ప్రతినిధుల పేరుతో బాధితుడికి ఫోన్లు వచ్చాయి. బాధితుడు దానికి ఒప్పుకోకపోవడంతో.. సెబీ నుంచి భారీ పెనాల్టీ పడుతుందని హెచ్చరించారు. "నా దగ్గర డబ్బుల్లేవు' అని చెబితే.. బజాజ్ క్యాపిటల్ నుంచి భారీగా లోన్ ఇప్పించి, ఇన్వెస్ట్ చేయించారు. లాభాలు కూడా భారీగా వచ్చినట్లు యాప్‌లో కనిపించడంతో.. బాధితుడు విత్‌డ్రా చేసుకునేందుకు యత్నించగా.. ఆ ఆప్షన్ కనిపించలేదు. యాప్ ప్రతినిధులకు కాల్ చేసినా.. స్పందన లేదు. దీంతో బాధితుడు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

ప్రాణం మీదికి తెచ్చిన వివాహేతర సంబంధం

దుండిగల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం, పైగా అనుమానంతో మహిళ ప్రాణాల మీదకి తెచ్చిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. గండి మైసమ్మ చౌరస్తా ప్రాంతంలో ఉండే జీషాన్‌ఖాన్(35) చింతల్ ప్రాంతానికి చెందిన గృహిణి(38) మధ్య ఏర్పడిన పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఎప్పటి లాగానే జీషాన్‌ఖాన్ గృహిణికి బుధవారం ఫోన్ చేసి తన వద్దకు రావాలని కోరాడు. దీంతో అతడి వద్దకు వస్తున్న సమయంలో ఆమెకి ఫోన్ చేస్తూనే ఉన్నాడు. ఆ సమయంలో ఫోన్ కాల్ వెయిటింగ్ వస్తుండడంతో అనుమానం పెంచుకున్న జీషాన్‌ఖాన్ గదికి వచ్చిన గృహిణితో ఘర్షణ పడ్డాడు.

ఆవేశానికి లోనైన జీషాన్‌ఖాన్ కత్తితో ఆమె కడుపులో పొడిచాడు. అనంతరం అతడు కూడా ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వెంటనే గమణించిన స్థానికులు గృహిణిని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. జీషాన్‌ఖాన్‌ను మరో ఆస్పత్రికి తరలించారు. ఇరువురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసుకున్న దుండిగల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ఒడిశా నుంచి సికింద్రాబాద్‌కు గంజాయి

● రైలులో రవాణా ● స్మగ్లర్ అరెస్ట్.. 22 కేజీల గంజాయి స్వాధీనం


అరెస్టయిన స్మగ్లర్, స్వాధీనం చేసుకున్న గంజాయి

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): బ్యాగ్‌లలో గంజాయి నింపుకొని ఒడిశా నుంచి రైల్లో హైదరాబాద్‌కు వచ్చి పోలీసుల కళ్లుగప్పి సరుకును సరఫరా చేయాలని చూసిన ఘరానా స్మగ్లర్‌ను హైదరాబాద్ నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్(హెచ్ న్యూ) పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి రూ. 5.55 లక్షల విలువైన 22 కేజీల గంజాయి బ్యాగ్‌లను, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్ తెలిపిన వివరాల ప్రకారం.. కొంతమంది స్మగ్లర్స్ మాదకద్రవ్యాలను గుట్టుగా నగరానికి తెస్తున్నారు. ఇదే క్రమంలో ఒడిశా గజపతి జిల్లాకు చెందిన కురేష్ షైక్ అలియాస్ కురేష్‌కు నగరంలోని గంజాయి స్మగ్లర్‌తో పరిచయం ఉంది. అతడి ఆదేశాల మేర కు కురేష్ 22 కేజీల గంజాయిని బ్యాగ్‌లలో నింపుకొని రైల్లో సికింద్రాబాద్ చేరుకున్నాడు. అక్కడి నుంచి బయటకు వచ్చి రిసీవర్ కోసం ఎదురుచూస్తున్నాడు. అతడికి సరుకు అందజేసి, డబ్బు తీసుకొని వెంటనే వెళ్లిపోవడానికి వేచి చూస్తున్నాడు. ఇంతలోనే విశ్వసనీయ సమాచారం అందుకున్న హెచ్ న్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డానియేల్ బృందాలు రంగంలోకి దిగాయి. మార్కెట్ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడి చేసి కురేష్‌ను పట్టుకున్నారు. అతడి నుంచి గంజాయి స్వాధీనం చేసుకున్నారు. మార్కెట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సౌరశక్తిని ప్రోత్సహిద్దాం

అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్



రోజా మహిళా సంఘం ప్రతినిధులకు అవార్డు అందజేస్తున్న వాణీప్రసాద్

హైదరాబాద్ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షించడంలో భాగంగా వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు సౌరశక్తి(సోలార్ పవర్)ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అటవీ, పర్యావరణ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన వేడుకలలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక ద్వారా వృక్ష సంపదను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. అలాగే, భూ వినియోగ మార్పులు, నీటి వనరుల పర్యవేక్షణకు రిమోట్ సెన్సింగ్‌తో పాటు జీఐఎస్ (గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్) సాంకేతికతను వినియోగించి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. సభ్య కార్యదర్శి జ్యోతి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. ప్రమాదకరమైన వ్యర్థాలను సరైన రీతిలో నిర్వహించి కాలుష్య నివారణకు సహకరించాలని పరిశ్రమల యాజమాన్యాలకు సూచించారు. చెట్ల పెంపకంలో విద్యార్థులను భాగస్వాములను చేయడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ఎంతో ముఖ్యమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా వివిధ పద్ధతుల ద్వారా పర్యావరణ పరిరక్షణకు పాటు పడుతున్న పరిశ్రమలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, స్వచ్ఛంద సంస్థల, పొదుపు సంఘాల ప్రతినిధులకు అవార్డులను అందజేశారు. కార్యక్రమంలో పీసీబీ చీఫ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ రఘు, సామాజిక శాస్త్రవేత్త ప్రసన్నకుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

మజీద్‌బండలో పొంగుతున్న డ్రైనేజీ


రోడ్డుపై పారుతున్న డ్రైనేజీ నీరు

గచ్చిబౌలి, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): మజీద్‌బండలో డ్రైనేజీ పొంగిపొర్లుతోంది. మురుగునీరంతా రోడ్డుపై చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మురుగు కారణంగా దుర్వాసన వస్తోందని, ఆ రోడ్డు గుండా నడవలేని పరిస్థితి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారం రోజుల డ్రైనేజీ పొంగుతున్నా అధికారులు ఇటువైపు కన్నెత్తి చూడడంలేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై అధికారులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడం లేదని మజీద్‌బండవాసులు వాపోతున్నారు. మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో దోమల సమస్య ఎక్కువయిందని, రాత్రి కంటిమీద కునుకు లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

న్యాయ పట్టభద్రులకు ఉచిత శిక్షణ

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని షెడ్యూల్ కులాలకు చెందిన న్యాయ పట్టభద్రులకు మూడేళ్లపాటు ఉచిత నైపుణ్య శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ వెల్ఫేర్ ఆఫీసర్ యాదయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ పొందేవారికి నెలకు రూ.3 వేల స్టయిఫండ్, రూ.50 వేల డిజిటల్ బుక్స్, ఫర్నిచర్, కంప్యూటర్, డ్రెస్ ఇస్తామని తెలిపారు. బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకునేందుకు ఫీజు కూడా చెల్లిస్తామని పేర్కొన్నారు. అర్హులైన వారు ఈ నెల 7 నుంచి జూలై 6వ తేదీలోపు tsepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

ఔరంగాబాద్‌లో ఓటమి

లోక్‌సభలో మజ్లి్‌స్‌కు మళ్లీ ఒకే ఒక్కడు!

హైదరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): గత లోక్‌సభలో ఆలిండియా మజ్లిస్ ఇత్తెహాదుల్ ముస్లిమీన్ (ఏఐఎంఐఎం) పార్టీకి ఇద్దరు సభ్యులుండగా ఈసారి ఒకే ఒక్క సభ్యుడితో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి. హైదరాబాద్ కేంద్రంగా జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషిస్తున్న మజ్లిస్ మొట్టమొదటిసారి 1984 పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టింది. అప్పటి నుంచి వరుసగా ఆరుసార్లు సుల్తాన్ సలాఉద్దీన్ ఒవైసీ, అనంతరం ఆయన కుమారుడు అసదుద్దీన్ ఒవైసీ 2004 నుంచి ఇప్పటి వరకు ఐదుసార్లు లోక్‌సభ సభ్యుడిగా వరుసగా ఎన్నికయ్యారు. ఈ సారి అసదుద్దీన్ ఒవైసీ భారీ మెజారిటీతో లోక్‌సభకు ఎన్నికయ్యారు. కాగా, 2019లో మహారాష్ట్రలో జరిగిన రాజకీయ పరిణామాల్లో ఔరంగాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి మజ్లిస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఇంతియాజ్ జలీల్ విజయం సాధించి లోక్‌సభలో అడుగుపెట్టారు. దీంతో గత లోక్‌సభలో మజ్లి్‌స్‌కు ఇద్దరు సభ్యుల బలం ఉండేది. ఈ సారి ఔరంగాబాద్ నుంచి పోటీ చేసిన ఇంతియాజ్‌జలీల్ శివసేన అభ్యర్థి చేతిలో ఓటమి పాలయ్యారు. అలాగే, బీహార్‌లోని కిషన్‌గంజ్ సీటును కైవసం చేసుకునేందుకు మజ్లిస్ తీవ్రంగా ప్రయత్నించింది. పార్టీ ఆ రాష్ట్రశాఖ అధ్యక్షుడు అక్తరుల్ ఇమాన్‌ను అభ్యర్థిగా ఖరారు చేసింది. పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ బీహార్‌లో పర్యటించి ప్రచారం చేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు. దీంతో మళ్లీ లోక్‌సభలో మజ్లిస్ పార్టీ ప్రతినిధిగా అసదుద్దీన్ ఒవైసీ ఒక్కరే ప్రాతినిధ్యం వహించనున్నారు.

భార్య గొంతు కోసిన భర్త

చందానగర్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): చందానగర్ బెల్ ఎంఐజీ కాలనీలో ఓ మహిళపై హత్యాయత్నం జరిగింది. భర్తే భార్య గొంతు కోసి పరారయ్యాడు. ఎంఐజీలో తులసి(45) కొంతకాలంగా కుటుంబంతో కలిసి నివాసముంటుంది. కేటరింగ్ వృత్తి నిర్వహిస్తున్న ఆమె స్థానికంగా కర్రీ పాయింట్ నిర్వహిస్తోంది. బుధవారం రాత్రి తులసి కూరలు అమ్ముతుండగా అక్కడకు వచ్చిన భర్త తులసి గొంతు కోసి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న చందానగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని తులసీని నలగండ్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు.

నగరాలు - పర్యావరణంపై అధ్యయనం!

హైదరాబాద్ సిటీ, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ టౌన్ ప్లానర్స్ ఇండియా తెలంగాణ రీజనల్ చాప్టర్ ఆధ్వర్యంలో ప్లానింగ్ విద్యార్థులకు జాతీయ స్థాయిలో 2024కుగాను నిర్వహించిన పోటీల్లో విజేతలను ప్రకటించారు. డీటీసీపీ డైరెక్టర్ ఎస్.దేవేందర్‌రెడ్డి చైర్మన్, కార్యదర్శి మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో 'నగరాలు- పర్యావరణం' అనే థీమ్‌తో మాస్టర్ ఆఫ్ ప్లానింగ్, బ్యాచిలర్ ఆఫ్ ప్లానింగ్ విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. దేశంలోని ఏదైనా నగరంలో(నీళ్లు, వాతావరణం, ఎనర్జీ, వెజిటేషన్ తదితర సబ్ థీమ్‌లపై) అధ్యయనం చేసి శాస్త్రీయ విధానంలో పేపర్, పోస్టర్ సమర్పించారు. బుధవారం పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. త్రిస్సూరు నగరంపై కోల్‌కతా ఎస్ఐటీకి చెందిన విద్యార్థులు అర్షియా, అనుశ్రీ, ఆదర్శ్ అధ్యయనం

ప్లానింగ్ విద్యార్థులకు బహుమతుల ప్రదానం

చేసి 'కర్బన ఉద్గారాలు- ప్రభావాల అంచనా'పై సమర్పించిన పేపర్‌కు ప్రథమ, 'బెంగళూరులో నీటి సంక్షోభం-వ్యూహాత్మక విధానాల విశ్లేషణ'పై హైదరాబాద్ జేఎన్ఏఎఫ్‌యూ విద్యార్థులు గాజుల అంజలి, మేగరాజ్ ధనుంజయ్, అభినయ్‌ఇంద్రాణి పేపర్‌కు ద్వితీయ, 'నీటి లభ్యత-సామాజిక, పర్యావరణ ప్రభావాలు' అంశంపై చెన్నైలో అవలంబిస్తోన్న విధానాలపైన ఎస్‌పీఏ ఢిల్లీకి చెందిన విద్యార్థులు కలంగుట్కర చిన్మయి, దేవేష్ పట్వారిబ్, ధనుష్ కుమార్ సమర్పించిన పేపర్‌కు తృతీయ బహుమతి లభించింది. సెమినార్‌లో వక్తలుగా పాల్గొన్న హైదరాబాద్ అర్బన్ ల్యాబ్స్ డైరెక్టర్ అనంత్ మరిగంటి, హైదరాబాద్ వర్సిటీ ప్రొఫెసర్ శ్రీనివాస్ పెంటకోటలు దేవేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు.

నిద్రిస్తున్న వ్యక్తి పైనుంచి వెళ్లిన రెడీమిక్స్ వాహనం

● మృతి చెందిన కార్మికుడు

పేట్‌బషీరాబాద్, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న భవనం వద్ద నిద్రిస్తున్న కార్మికుడి పైనుంచి రెడీమిక్స్ వాహనం వెనక్కి తీస్తుండగా ఆ ప్రాంతంలో నిద్రిస్తున్న వ్యక్తి పై నుంచి వాహనం వెళ్లింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన హరేరామ్ సింగ్(40) ఐదు రోజుల క్రితం వచ్చి కొంపల్లిలోని షైస్పేస్ నిర్మాణంలో పనికి చేరాడు. మంగళవారం రాత్రి నిర్మాణానికి సిమ్మెంట్ కాంక్రీట్ వాహనం వచ్చింది. అది రివర్స్ తీసే క్రమంలో వెనుక వైపు పడుకున్న హరేరామ్‌సింగ్‌ను గమనించకుండా వాహనాన్ని నడిపాడు. ఈ క్రమంలో అతడి పైనుం చి వెళ్లడంతో హరేరామ్‌సింగ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.


పర్యావరణ దినోత్సవంలో రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, ఇతర అధికారులు, విద్యార్థులు

జేఎన్టీయూలో వేడుకగా పర్యావరణ దినోత్సవం

● మొక్కలు నాటిన రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్ తదితరులు

హైదరాబాద్ సిటీ, జూన్ 5(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జేఎన్‌టీయూలో బుధవారం ఘనంగా నిర్వహించారు. సివిల్ ఇంజనీరింగ్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో విరివిగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ జీ.వి.నరసింహారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ వి.పద్మావతి, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త శోభారాణి, ప్రోగ్రాం ఆఫీసర్ ఎం.పద్మావతి, బీక్స్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్లు సైదానాయక్, శ్రీలక్ష్మి, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సుప్రీతి పాల్గొన్నారు. అయితే, ప్రపంచ పర్యావరణ దినోత్సవం గురించి యూనివర్సిటీ పర్యావరణ విభాగం ఆచార్యులు గానీ, విద్యార్థులు గానీ పట్టించుకోకపోవడం గమనార్హం.

చెట్లతోనే మానవ మనుగడ


మొక్కలు నాటుతున్న కృష్ణారెడ్డి, సత్యనారాయణ

దుండిగల్, జూన్ 5(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని కాపాడినప్పుడే మానవ మనుగడ సాగించొచ్చని జిల్లా వెల్ఫేర్ అధికారి కృష్ణారెడ్డి అన్నారు. దుండిగల్ మున్సిపల్ ఆఫీసు ఎదురుగా ఉన్న ఓల్డ్ ఏజ్‌హోంలో మున్సిపల్ కమిషనర్ కె.సత్యనారాయణతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అందరూ తమ బాధ్యతగా మొక్కలను నాటి సంరక్షించాలని కోరారు. మున్సిపల్ ఇంజనీర్ ప్రవీణ్‌కుమార్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సాత్విక్, అంగన్‌వాడీటీచర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

● **అందరూ మొక్కలు నాటాలి**

నిజాంపేట్: అధికంగా చెట్లను నరికివేస్తుండడంతో పర్యావరణానికి ముప్పు కలుగుతోందని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం పర్యావరణం దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం వల్ల జీవనశైలి మెరుగుపరుచుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్, గంగాధర్, ప్రభాకర్‌రెడ్డి, బాలకృష్ణ, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.